క్లుప్తంగా

రాజన్న సేవలో మంత్రి పొన్నం, విప్



పూజలు చేస్తున్న మంత్రి పొన్నం, ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివా స్ బుధవారం రాత్రి రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్త గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఎనగంటి నాగేంద్రబాబు బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించగా నిమ్మపల్లిలో ప్రచార సభలో పార్టీలో చేరారు. ఆయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. మంగళపల్లి గ్రామానికి చెందిన అరె క్షత్రియ సంఘం అధ్యక్షుడు బోరగాయ మల్లేశం కాంగ్రెస్‌లో చేరారు.

షెడ్ టెన్నల్‌లో కూరగాయల సాగుతో లాభాలు



కూరగాయల సాగు గురించి వివరిస్తున్న వ్యవసాయ శాఖ విద్యార్థులు

తంగళ్లపల్లి: షేడ్ టెన్నల్ పద్ధతిలో కూరగాయల సాగుచేయడంతో అధిక దిగుబడి సాధించి ఎక్కువ లాభాలు పొందవచ్చని బాబు జగ్జీవన్ రాం వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. బుధవారం షెడ్ టెన్నల్స్‌లో పెంచుతున్న కూరగాయ పంటల గురించి రైతులకు వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ షెడ్ టెన్నల్‌లో ఆకుకూరలు పాలకూర, మెంతి, కొత్తిమీర తోపాటు తీగజాతి మొక్కలు సొరకాయ, తదితర కూరగాయలు పండించవచ్చన్నారు. చీడపీడల సమస్యలు ఉండవని నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాలుగో సంవత్సరం చదువుతున్న వ్యవసాయ శాఖ విద్యార్థులు ఎస్.అభిరాం, అఫ్రీన్, కె.అలేఖ్య, అపూర్వ, దన్విక్ష, పవన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చిన్మయానంద జయంతి

సిరిసిల్లటౌన్: ఆధ్యాత్మిక వేత్త చిన్మయానంద స్వామి జయంతిని సిరిసిల్లలో ఘనంగా నిర్వహించారు. బుధవారం బీవైనగర్ హనుమాన్ ఆలయంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీత, అష్టోత్తర పఠనం తదితర కార్యక్రమాలు జరిపారు. జిల్లా చిన్మయమిషన్ సభ్యులు సజ్జనం శ్రీనివాస్, కోడం నారాయణ, జనపాల శంకరయ్య, రాంచెంద్రం, మల్లేశం, కమలాకర్, సృజన, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యం

కోనరావుపేట: వేములవాడ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ఆర్ఆర్ టాక్స్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్టేట్ లీగల్ కన్వీనర్, బుర్ర రవితేజ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోడీ, కరీంనగర్‌లో బండి సంజయ్ జీఎస్టీ వసూలు చేస్తున్నారని అన్నారు. గ్రానైట్ మైనింగ్‌లో మాఫీయాను బయటకు తీస్తామని మౌనం వహిస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌లో బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు కాంగ్రెస్ కు ఓట్లువేసి, బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన హరిత ప్రేమికుడు దుంపెన రమేశ్‌కు ఇటీవల మంథనిలో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళాసంస్థ జాతీయ అవార్డు అందించగా ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రమేశ్ గత 13 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై చూపుతున్న మక్కువను గుర్తించిన ఆయాస్వచ్ఛంద సంస్థలు మూడు జాతీయ అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. మిత్రులు గిరిధర్‌రెడ్డి, వెంకట నర్సింహరెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

సేకరించి కాలుస్తున్నారు!

- గ్రామాల్లో వృథాగా వర్మి కంపోస్ట్ షెడ్లు
- చెత్త, ఇతర వ్యర్థాలను సేకరించి కాల్చుతున్న సిబ్బంది
- కాగితాల్లోనే వర్మి కంపోస్ట్ తయారు
- ఉన్నతాధికారులను నమ్మించేందుకు కుండీల్లో చెత్త



కిష్టంపేటలో కంపోస్ట్ షెడ్ వద్దే వ్యర్థాలను కాల్చివేసిన సిబ్బంది

చందుర్తి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. ఇళ్లలోని చెత్తను తరలించేందుకు పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను సమకూర్చి, జీపీ పారిశుద్ధ్య కార్మికులకు బాధ్యతలను పెంచింది. గ్రామాల్లోని వీధుల్లో ట్రాక్టర్‌తో ఇళ్లలోని చెత్తను సేకరిస్తున్నారు. వీధుల్లోనూ, మురుగుకాలువల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామ పంచాయతీ రెండు డబ్బాలు అందించినా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేక తడి, పొడి చెత్తను ఒకే డబ్బాలో వేసి ఇస్తున్నారు.

అవగాహన లోపం...

మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 35 వేలకు పైగా జనాభా ఉంది. జనాభా ప్రతిపాదికన గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య నిధులు అందజేస్తోంది. మండలంలోని ఒకటి, రెండు గ్రామ పంచాయతీల్లో మినహాయిస్తే, ఏ గ్రామ పంచాయతీ పరిధిలో ఆశించిన మేరకు సేంద్రీయ ఎరువులను తయారీ చేయడం లేదు. కంపోస్టు షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్మాణాలను పూర్తిచేశారు. కాగా కొన్ని గ్రామాల్లో రెండు మూడు కిలోమీటర్ల దూరంలో షెడ్లను ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లేందుకు దారికూడా సక్రమంగా లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడో ఓ చోట పారబోస్తున్నారు. కొందరు సమీపంలో ఉన్న ఒర్రెల్లో, మరికొందరు రోడ్ల వెంట పోసి నిప్పు పెడుతున్నారు. దీంతో పర్యావరణం కూడా దెబ్బ తింటుంది. రోడ్లవెంట ప్రయాణికులు సైతం పొగతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అమలుకు సహకరించడం పోవడంతో షెడ్లన్నీ ఖాళీగా ఉంటున్నాయి.



చందుర్తిలో కాలువ పక్కనే పారబోసిన చెత్త

ఏటా రూ.8.75 లక్షలు

గ్రామాల్లో చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లకు ఏటా దాదాపు రూ.8.75 లక్షల డీజిల్ ఖర్చులు అవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కంపోస్ట్ షెడ్ల వినియోగంతో ఆశించిన మేర సేంద్రీయ ఎరువును తయారు చేస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావించినా ఫలితం లేకుండా పోతోంది. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ ఎరువును ఏడాదిలో రెండు సార్లు అయినా తీసిన గ్రామ పంచాయతీలు లేవు. కానీ మండలస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు మాత్రం కంపోస్ట్ షెడ్లలో తయారు చేసిన సేంద్రీయ ఎరువును హరితహారంలో వినియోగిస్తున్నామంటూ కాగితాల్లో నివేదికలు తయారు చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల సమీపంలోనే..



గ్రామంలోని చెత్తాచెదారం, ప్లాస్టిక్‌బాటిళ్లు, ఇతర వ్యర్థాలను ట్రాక్టర్లలో తీసుకొచ్చి ఇళ్ల సమీపంలో పారబోస్తున్నారు. తర్వాత తరుచూ నిప్పు పెడుతుండడంతో విపరీతమైన పొగ వస్తుంది. దీంతో ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టం అవుతోంది. వ్యర్థాల వాసనతోపాటు అనారోగ్య బారిన పడుతున్నాం. – లక్కర్సు శశి, చందుర్తి

మళ్లీ అవగాహన కల్పించాలి



గ్రామాల్లో చెత్త సేకరణ సజావుగానే సాగుతోంది. తడి, పొడి చెత్త సేకరణకు ప్రజలు సహకరించడం లేదు. గ్రామస్థాయిలో మరోసారి అవగాహన కల్పించాలి. చెత్త సేకరణలో లభ్యమైన తునికాకు వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారు చేస్తున్నాం. ఇతరవ్యర్థాలు లేకపోవడంతో తునికాకు ఒక్కటే తయారీకి దోహదపడుతోంది.

– బండి ప్రదీప్ కుమార్, ఎంపీవో, చందుర్తి

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ, తదితరులు



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లు

సిరిసిల్లటౌన్: తెలంగాణ హక్కుల సాధన కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం సిరిసిల్లలో బీఆర్‌ఎస్ తరపున విస్తృత ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, నేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తూ పాలన సాగిస్తుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపించాలంటే రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఆకునూరి శంకరయ్య, ప్రవీణ్, మ్యాన రవి, తాటి వెంకన్న, బూర బాబి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహిళా నాయకులు ముస్తాబాద్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎంపీటీసీ కంచం మంజుల, మాజీ సర్పంచ్ సుమతి, రేనుక, ఏఎంసీ మాజీ చైర్మన్ జానబాయి, స్వర్ణలత, నవీన తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌కు మద్దతుగా ఉమ్మడి జిల్లా మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఎల్లారెడ్డిపేట, కిషన్‌దాస్‌పేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, పట్టణ అధ్యక్షుడు సందీప్, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, అనసూయ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో పూజలు

బండలింగంపల్లిలోని శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ..బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తడుకల దేవరాజు, తడుకల స్వామి, జంగ అంజిరెడ్డి, పద్మారెడ్డి, కొత్తపల్లి నర్సింలు, బాల్‌రాజ్, నారాయణరెడ్డి, నర్సాగౌడ్, రాములు, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రుద్రంగి: మండలకేంద్రంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయకులు గంగం మహేశ్, మాడిశెట్టి ఆనంధం, రవి, మహిళలు, తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటా నాయకులు ఓట్లు అభ్యర్థించారు. నాయకులు మల్లేశం, రవి, సంతోష్, నాగరాజు, భగవంతం, తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన నాయకులు



కోనరావుపేట: బావుసాయిపేట నుంచి సభకు తరలుతున్న బీజేపీ నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం జరిగిన ప్రధాని నరేంద్రమోదీ జన సభలో వేములవాడ మండల బీజేపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కోనరావుపేట: వేములవాడలో ప్రధాని నరేంద్ర మోదీ సభకు బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు.

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు నర్సింహాచారి, లక్ష్మణ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేములవాడలో జరిగిన మోదీ సభకు తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్ల: సిరిసిల్ల కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట: రాగట్లపల్లిలో ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: రాష్ట్రంలో రైతులకు రూ.2లక్షల రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేస్తారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల గాంధీనగర్‌లోని కూరగాయల మార్కెట్ నుంచి నెహ్రూనగర్ మీదుగా కొత్త బస్టాండు వరకు బుధవారం నాయకులతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని ఆయన కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు సత్యనారాయణగౌడ్, బాలరాజు, వైద్య శివప్రసాద్, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, దేవయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీలో భారీ సంఖ్యలో గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు బైరి రమేష్, మాజీ సర్పంచ్ బైరి శ్రీవాణి ఆధ్వర్యంలో సమారు 300 మంది, బీఆర్‌ఎస్ నాయకులు, కళాకారులు కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కేకే మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పూర్మాని మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు వైద్య శివప్రసాద్, పూర్మాని రాంలింగా రెడ్డి, లింగాల భూపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు క్రైస్తవ జేఏసీ మద్దతు..

సిరిసిల్లటౌన్: తెలంగాణ క్రైస్తవ సంఘాల జేఏసీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించింది. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ క్రైస్తవ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ములకల ప్రవీణ్ మాట్లాడారు. చొడమల సన్నీ ఎడ్వర్డ్, పేరుక జోసెఫ్, సంతోష్‌కుమార్, రమేశ్, రహమత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, నిజామాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు దేవరాజు, రాజు, నాయకులు సతీశ్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. రాగట్లపల్లి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, దుమాల, తిమ్మాపూర్‌లో ప్రచారం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారికి మజ్జిగ ప్యాకెట్లు అందించి ఓట్లు అభ్యర్థించారు. నాయకులు నేవూరి రవీందర్ రెడ్డి, మహేందర్, బాబు, పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మి, అంజన్‌రావు, ఎంపీటీసీ శ్రీనివాస్, యాదగిరిగౌడ్, గజ్జెల రాజు, కిషన్ రావు, నరేశ్, నర్సింలు, దీటి నర్సింలు, విజయ్, భాను, ధర్మేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ అధ్యక్షతన బుధవారం యూత్ కాంగ్రెస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లలో మండలానికి బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్ రావు గెలిపించాలన్నారు. మండల ప్రజలు మరోసారి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నరేశ్, జోగుల కార్తీక్, నాయకులు జలందర్, మండేపల్లి రవి, గుంటి సతీశ్, వీరవేణి సంతోష్, నవీన్, పేరం ప్రశాంత్ మాలోత్ వినోద్, సన్నీ, శ్రీనాథ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

బోయినపల్లి : మండలకేంద్రంలో బీరప్ప కల్యాణ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యంను ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ నాయకులు, కుర్మ, యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలకు హాజరు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో జరుగుతున్న బీరప్ప జాతర ఉత్సవాలకు కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఇల్లంతకుంట ఎంపీటీసీ నర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, చందన్, రాములు, అంజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న నాయకులు

బస్టాండ్‌లోకి వెళ్లేదెలా?



నర్మాల మానేరు క్యాంపు కూడలిలోని బస్టాండ్ ఎదుట గొయ్యి, పిచ్చిమొక్కలు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు క్యాంపు కూడలిలో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారుతోంది. బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లడానికి వీల్లేకుండా పెద్ద గొయ్యి ఉంది. దానిని పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ప్రయాణ ప్రాంగణం అలంకారప్రాయంగానే మిగిలింది.

ఆధార్ సేవలకు మోక్షమెప్పుడో?

- రెండేళ్లుగా పనిచేయని ఆధార్ సెంటర్
- ఇబ్బంది పడుతున్న 28 గ్రామాల ప్రజలు



కోనరావుపేటలో మూసి ఉన్న ఆధార్ నమోదు కేంద్రం

కోనరావుపేట: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం కొన్నిరోజులుగా పనిచేయకపోవడంతో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండేళ్లుగా మూసి ఉండడంతో ఆధార్ సేవలకోసం మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని 28 గ్రామాలకు కలిపి ఒకే ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో అన్ని గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు అందుతుండేవి. ఆధార్ నమోదు, ఆధార్‌లో చిరునామా, వయస్సు, పేరులో తప్పులు తదితర అన్ని రకాల సేవలు అందుతుండేవి. 2022 మార్చినుంచి ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ప్రతి రోజూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తిరిగి వెళ్తున్నారు.

ఆధార్ అప్‌డేట్‌పై అవగాహన కరువు

2015 ముందుకంటే ఆధార్ గుర్తింపుకార్డు పొందిన వారు యూఐడీఏఐ ఆదేశాల ప్రకారం సంబంధిత పత్రాలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. 15 ఏళ్ల చిన్నారులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి. ఇందుకోసం సదరు వ్యక్తులు ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. విషయం తెలుసుకున్న కొంతమంది వెళ్లగా సెంటర్ మూసేసి ఉంటుంది.

రెండేళ్లుగా తిప్పలు..

కోనరావుపేట మండలంలో గత 25 నెలలుగా ఆధార్ సెంటర్ పని చేయకపోవడంతో అన్ని గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రోజూ మారుమూల గ్రామాల నుంచి రావడం, తాళంవేసి ఉండడంతో తిరిగి వెళ్లిపోవడం పరిపాటిగా మారుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆధార్‌సెంటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని కోరుతున్నారు.

సిరిసిల్లకు వెళ్తున్నాం



మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ రెండేళ్ల నుంచి పనిచేయడంలేదు. కోనరావుపేటలో ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. దీంతో సిరిసిల్లకు వెళ్లాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల ప్రజలు, గిరిజన తండాల ప్రజలు రావడానికి, వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆధార్ సెంటర్‌ను వినియోగంలోకి వచ్చేలా చూడాలి.

– నాగండ్ల భూమేశ్, నిమ్మపల్లి

ప్రారంభానికి చర్యలు

కోనరావుపేటలో ఆధార్ సేవలను పునరుద్ధరిస్తాం. కొన్ని కారణాలతో మండలకేంద్రంలోని ఆధార్ నమోదుకేంద్రం సేవలను నిలిపివేశారు. త్వరలోనే సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తిచేశాం. త్వరలోనే కోనరావుపేటలో ఆధార్ సేవలు ప్రారంభమవుతాయి.

– మహేశ్, జిల్లా మేనేజర్

ఘనంగా మంత్రి 'పొన్నం' జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్/వేములవాడ/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం సిరిసిల్ల, నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో మంత్రి ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా : 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899